ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

ఓల్గా రాజకీయ కథలు - స్త్రీవాద దృక్పథం

డా॥ ముస్కే మేఘమాల

అసిస్టెంట్ ప్రొఫెసర్,తెలుగు విభాగము,ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మరిపెడ, మహబూబాబాద్ (జిల్లా).

muskemeghana@gmail.com

Article Received: 08/09/2026

Article Accepted: 27/10/2026

Published Online: 29/10/2026

DOI:10.53414/Sahithyatharangini.2026.3.4.90

వ్యాస సంగ్రహం: ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో స్త్రీవాద దృక్పథానికి, సామాజిక చైతన్యానికి విశిష్టమైన స్థానం కల్పించిన రచయిత్రి ఓల్గా. ఆమె రచించిన రాజకీయ కథలు స్త్రీల జీవితాలను, స్త్రీల సమస్యలను వ్యక్తిగతమైనవిగా లేదా కుటుంబానికి మాత్రమే పరిమితమైనవిగా కాకుండా, సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆధిపత్య సంబంధాలతో ముడిపడిన అంశాలుగా రచయిత్రి ఆవిష్కరించారు. స్త్రీ శరీరంపై సమాజం విధించే నియంత్రణలు, లింగవివక్ష, సంప్రదాయాల పేరిట కొనసాగుతున్న అసమానతలు, స్త్రీల వ్యక్తిత్వ వికాసానికి ఎదురయ్యే అవరోధాలు ఈ కథల్లో ప్రధానంగా ప్రతిఫలిస్తాయి. స్త్రీల అనుభవాల వెనుక ఉన్న అధికార సంబంధాలను వెలికితీస్తూ, తమ జీవితాలను తామే అర్థం చేసుకొని స్వతంత్ర దృక్పథాన్ని అలవరచుకోవాల్సిన అవసరాన్ని రచయిత్రి స్పష్టం చేశారు. సాధారణంగా కనిపించే కుటుంబ, వ్యక్తిగత జీవిత సంఘటనల్లో అంతర్లీనంగా ఉన్న ఆధిపత్య ధోరణులను విశ్లేషించడం ద్వారా ప్రతి వ్యక్తి జీవితంలోనూ రాజకీయ కోణం ఉంటుందని నిరూపించారు. ఈ పరిశోధన ఓల్గా రాజకీయ కథలు స్త్రీవాద, సామాజిక దృక్పథాలతో పరిశీలిస్తూ స్త్రీ అస్తిత్వం, స్వయంనిర్ణయాధికారం, ఆత్మగౌరవం, సమానత్వం వంటి అంశాల ప్రాధాన్యాన్ని తెలియజెప్పటం వ్యాసం ప్రధాన ఉద్దేశం.

కీలక పదాలు : ఓల్గా, రాజకీయ కథలు, స్త్రీవాద దృక్పథం, పితృస్వామ్యం, స్త్రీ అస్తిత్వం, శరీర స్పృహ, లింగవివక్ష, స్త్రీ స్వేచ్ఛ, మానవ సంబంధాలు.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

1. ప్రవేశిక : సాహిత్యంలో కథాప్రక్రియ సామాజిక జీవితాన్ని, మానవ సంబంధాలను, సమాజంలోని అసమానతలను ప్రతిబింబించే శక్తివంతమైన సాహిత్య ప్రక్రియగా అభివృద్ధి చెందింది. గురజాడ అప్పారావు రచించిన 'దిద్దుబాటు' ఆధునిక తెలుగు కథానికా వికాసంలో విశిష్ట స్థానాన్ని పొందింది. సామాజిక దురాచారాలను, స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను కథావస్తువులుగా స్వీకరించిన రచయితలు సాహిత్యం ద్వారా సమాజ సంస్కరణకు కృషి చేశారు. కాలక్రమంలో స్త్రీల సమస్యలను కేవలం వ్యక్తిగతమైనవిగా కాకుండా, పితృస్వామ్య వ్యవస్థతో ముడిపడిన సామాజిక అంశాలుగా విశ్లేషించే స్త్రీవాద దృక్పథం బలపడింది.

ఈ నేపథ్యంలో ఓల్గా రచించిన రాజకీయ కథలు ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. ఈ కథలు స్త్రీ శరీరం, మనసు, వ్యక్తిత్వం, కుటుంబ సంబంధాలపై సమాజం విధించే నియంత్రణలను ప్రశ్నిస్తాయి. సంప్రదాయాల పేరుతో కొనసాగుతున్న లింగవివక్ష, వ్యక్తిగత నిర్ణయాలకు ఎదురయ్యే అవరోధాలు, ఆత్మగౌరవానికి సంబంధించిన సమస్యలను కథల ద్వారా ఆవిష్కరించారు. స్త్రీ తన అస్తిత్వాన్ని గుర్తించి, స్వతంత్ర వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడం సామాజిక పరివర్తనలో కీలకమని స్పష్టం చేశారు. స్త్రీవాద కథల గురించి రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి తన మాటలలో "స్త్రీల శరీరం, మెదడు, హృదయాల మీద పురుషుల పెత్తనాన్ని వ్యతిరేకిస్తూ ఆధిపత్యం లేని జీవితాన్ని కోరుకుంటూ వస్తున్న కథానికలు స్త్రీవాద కథానికలు, స్త్రీ పట్ల పురుషులు ప్రదర్శించే వివక్ష అణచివేతలను ఈ కథలు ప్రశ్నిస్తాయి, ప్రతిఘటిస్తాయి, ఇంటా బయట స్త్రీలు పడ్డ బాధలను చిత్రిస్తాయి" (చంద్రశేఖర రెడ్డి, రాచపాళెం, మన నవలలు - మన కథానికలు, పుట 132) అని స్త్రీలు ఎదుర్కొనే సమస్యలను ఆవిష్కరించారు. ఈ వ్యాసం ఓల్గా రాజకీయ కథలు సంపుటిలోని కథలను స్త్రీ అస్తిత్వం, స్త్రీవాద దృక్పథాల ఆధారంగా పరిశీలిస్తూ, వాటిలో ప్రతిఫలించిన సామాజిక చైతన్యాన్ని విశ్లేషించటం ఈ వ్యాస ఉద్దేశం.

2.0 ఓల్గా రాజకీయ కథలు - స్త్రీవాద దృక్పథం?

2.1 సీత జడ - స్త్రీ శరీరంపై ఆంక్షలు : 'సీత జడ' కథ స్త్రీ తన శరీరంపై కూడా పూర్తి స్వేచ్ఛను పొందలేని పరిస్థితులను వివరిస్తుంది. స్త్రీ జుట్టు, అందం, పెళ్లి వంటి విషయాలపై కుటుంబం, సమాజం ఇలా ఉండాలి అనే కట్టుబాట్ల చట్టంలో బిగిస్తూ, సాంప్రదాయ ముసుగులో స్త్రీలపై విధించే అంశాలను ఈ కథ తెలియజేస్తుంది. అరవయ్యేళ్ల సీత అనారోగ్యం తర్వాత జుట్టు రాలిపోతుండటాన్ని చూసి తన

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

జీవితంలో జుట్టుతో ముడిపడిన చిన్ననాటి అనుభవాలను గుర్తుచేసుకుంటుంది. జుట్టును అందంగా కత్తిరించుకోవాలనే ఆమె కోరికను తల్లి తన బాల్యంలో అంగీకరించకపోవడం స్త్రీ వ్యక్తిగత ఇష్టాలకు కుటుంబ సంప్రదాయాలు అడ్డుగా నిలుస్తున్నాయని తెలియజేస్తుంది. "మగరాయుడు గొప్పవాడూ అతని గుండు గొప్పదైతే, ఆ గొప్పగుండు తనెందుకు చేయించుకోకూడదో మగరాయుడిగా ఎందుకుండకూడదో సీతకు అర్థం కాలేదు" (రాజకీయ కథలు, పుట 18), ఈ ప్రశ్న స్త్రీపురుషుల మధ్య ఉన్న అసమానతలను స్పష్టంగా చూపిస్తుంది.

దొంగతనం చేసిన పనిమనిషికి శిక్షగా గుండు చేయించడం, భర్త చనిపోయిన స్త్రీల జుట్టుపై ఆంక్షలు విధించడం స్త్రీ శరీరంపై పితృస్వామ్య సమాజం పెత్తనం చెలాయిస్తున్న తీరును తెలియజేస్తాయి. సీత మేనకోడలికి మీసాలు, గడ్డం రావడంతో అది ఆమె అనారోగ్య పరిస్థితికి కారణం అని తెలుసుకోకుండా ఎగతాళి చేయడం స్త్రీల రూపంపై సమాజం నుంచే కాకుండా కుటుంబం నుంచి కూడా వారు ఎదుర్కొనే పరిస్థితులను తెలియజేస్తుంది. పురుషుల్లో సహజంగా వయస్సు తో మారే శారీరక లక్షణాలను స్త్రీలలో తప్పుగా చూడటం లింగ వివక్షకు నిదర్శనం. అంతేకాక, స్త్రీలపై ఈ ఆంక్షలు విధించడంలో కుటుంబంలోని మహిళలు కూడా సంప్రదాయాల ప్రభావంతో భాగస్వాములవుతున్నారు. దీనివల్ల స్త్రీలపై సామాజిక నియంత్రణ ఒక తరం నుంచి మరో తరానికి కొనసాగుతోంది. స్త్రీ పురుషులు సమానమని చట్టాలు చెబుతున్న సామాజిక వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి.

"ఆడదాని జుట్టునింత గట్టిగా పట్టుకున్న సమాజం ఆడదాన్ని ఇంకెంత గట్టిగా పట్టుకుంటుంది. ఆ పట్టులోంచి తప్పించుకోకుండా ఈ జుట్టుల పండి బలహీనమై రాలిపోవటమేనా-" (రాజకీయ కథలు, పుట 23) అనే వాక్యం కథలోని ప్రధాన భావాన్ని తెలియజేస్తుంది, సమాజంలో ఉన్న ఆంక్షలు నడుమ తమ జీవితాలు ఏ ఆశలు ఆనందాలు లేకుండా ముగిసిపోవటమేనా! అని సమాజాన్ని ప్రశ్నించేవిగా ఉన్నాయి. నేటికీ స్త్రీలపై ఇతరులు చేసే వ్యాఖ్యలు (Body Shaming) వారి స్వేచ్ఛను ప్రభావితం చేస్తున్నాయి. స్త్రీ తన శరీరం, అలంకరణ, జీవితం గురించి స్వయంగా నిర్ణయాలు తీసుకునే హక్కు కలిగి ఉండాలి. ఆమెను బాహ్య సౌందర్యంతో కాకుండా ఆలోచనలు, ప్రతిభ, వ్యక్తిత్వం ఆధారంగా గుర్తించాలి. స్త్రీ స్వేచ్ఛను గౌరవించకుండా సమానత్వం సాధ్యం కాదనే విషయాన్ని ఈ కథ స్పష్టం చేస్తుంది. "యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః" అనే ఆర్యోక్తి స్త్రీలను గౌరవించాలని బోధిస్తున్నప్పటికీ, ఆచరణలో మాత్రం స్త్రీల శరీరం, అందం, వ్యక్తిగత ఇష్టాలపై

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

సమాజం ఆంక్షలు విధిస్తూనే, కట్టుబాట్లు అనే చక్రంలో బందీని చేస్తుంది. స్త్రీని గౌరవిస్తున్నామని చెప్పే సమాజమే ఆమె స్వేచ్ఛను నియంత్రించడం దాని ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ఈ వైరుధ్యాన్ని 'సీత జడ' కథ ప్రశ్నిస్తుంది.

2.2 కళ్ళు-స్త్రీ స్వేచ్ఛపై ఆంక్షలు : 'కళ్ళు' కథలో బాలిక ఆలోచనల ద్వారా స్త్రీలు ఎదుర్కొంటున్న ఆంక్షలు, లింగ వివక్ష, పురుషాధిక్య సమాజపు ధోరణులను రచయిత్రి సున్నితంగా విమర్శించారు. ఆడపిల్లలు ఎలా నడవాలి, ఎవరిని చూడాలి, ఎలా ప్రవర్తించాలి అనే విషయాలను కుటుంబం, సమాజం నిర్ణయించడం వారి స్వేచ్ఛను అడ్డుకుంటుందని కథ తెలియజేస్తుంది. "మన ఒంటిని మనం సరిగా చూసుకోగూడదు. అమ్మ కేకలేస్తుంది. ఏంటా చూడటం అని, పెద్దవుతున్న కొద్ది మగవాళ్ళని అసలు సరిగ్గా చూడకూడదు" (రాజకీయ కథలు, పుట 25) అనే వాక్యం బాలికలపై విధించే అనవసరమైన ఆంక్షలకు నిదర్శనం. మగపిల్లలకు స్వేచ్ఛనిస్తూ, ఆడపిల్లలకు భయాన్ని నేర్పించడం లింగ సమానత్వానికి విరుద్ధం. నేటికీ అమ్మాయిల దుస్తులు, స్నేహాలు, బయటకు వెళ్లే సమయాలపై ఆంక్షలు విధించడం ఈ వివక్ష కొనసాగుతోందని సూచిస్తుంది. "చూసిన తర్వాత ఏదన్నా చెయ్యాలి. లేకపోతే చూడటం ఎందుకు? చూడక ముందూ చూసిన తర్వాతా ఒకే రకంగా వుంటే చూడటం ఎందుకు?" (రాజకీయ కథలు, పుట 26) అనే వాక్యం అన్యాయాన్ని గుర్తించినప్పుడు స్పందించాల్సిన అవసరాన్ని తెలియజేస్తుంది. ప్రమాదంలో పడిన వ్యక్తికి సహాయం చేసిన కల్యాణిని ఆమె తండ్రి తప్పుపట్టడం, కొట్టడం ద్వారా మానవత్వంతో చేసిన పనిని కూడా స్త్రీ ప్రవర్తనకు ముడిపెట్టి చూడటాన్ని రచయిత్రి ప్రశ్నించారు.

నేటికీ మహిళలు ఎదుర్కొనే వేధింపులు, అన్యాయాలు అంటే అంశాలలో సమాజం బాధితులనే ప్రశ్నించే ధోరణి కనిపిస్తోంది. దీనికి పరిష్కారంగా మహిళల నిర్ణయాలను గౌరవించడం, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని ప్రోత్సహించడం అవసరం. స్త్రీ అందాన్ని బొట్టు, కాటుక, ఆభరణాలతో ముడిపెట్టడం ద్వారా బాహ్య అలంకరణల ఆధారంగా మహిళలను అంచనా వేసే ధోరణిని కూడా కథ విమర్శిస్తుంది. "అమ్మ కళ్ళకు ఏమీ కనిపించవు. కనిపించిన వాటి గురించి అమ్మ పట్టించుకోదు" (రాజకీయ కథలు, పుట 26) అనే వాక్యం సామాజిక ఆంక్షలకు అలవాటుపడి అన్యాయాన్ని ప్రశ్నించలేని స్త్రీల స్థితికి ప్రతీకగా నిలుస్తుంది. తల్లి కూడా సాంప్రదాయంగా కొనసాగుతున్న ఆంక్షలు భరించి వాటిని కూతురిపై విధించడం ద్వారా వివక్షను తరువాతి తరానికి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

అందిస్తోంది. స్త్రీలు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి రావటం అనేది సమాజం ఎదుర్కొంటున్న ఒక సామాజిక రుగ్మత. మొత్తంగా, కళ్ళు' కథ ద్వారా స్త్రీ స్వేచ్ఛను సమర్థిస్తూ, స్త్రీల జీవితాలను పరిమితం చేసే పురుషాధిక్య సమాజపు ధోరణులను సున్నితమైన విమర్శతో రచయిత్రి ఆవిష్కరించారు. స్త్రీలకు సమాన హక్కులు, ఆత్మగౌరవం, స్వతంత్ర ఆలోచన కల్పిస్తూ, కుటుంబం మరియు లింగ వివక్షకు తావు లేకుండా సమాజంపు ఆలోచన విధానంలో మార్పు రావాలని ఈ కథ సూచిస్తుంది.

2.3 'ముక్కుపుడక' కథ -స్త్రీ స్వేచ్ఛ, సమానత్వం : 'ముక్కుపుడక' కథలో వివాహ వ్యవస్థలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను, పురుషాధిక్య ధోరణిని, స్త్రీల వ్యక్తిగత స్వేచ్ఛను రచయిత్రి సామాజిక దృష్టితో విశ్లేషించారు. రమ చదువుకొని ఉద్యోగం చేస్తున్నప్పటికీ, ఆమె వివాహానికి కట్నం, చర్మవర్ణం, ముక్కుపై ఉన్న మచ్చ అడ్డంకులుగా మారతాయి. స్త్రీ వ్యక్తిత్వం, విద్య, సామర్థ్యాల కంటే బాహ్య సౌందర్యానికి ప్రాధాన్యమివ్వడం సమాజంలోని లింగ వివక్షను తెలియజేస్తుంది. "పెళ్ళికోసం ఆడపిల్లలు వీలైతే తను ప్రతి అవయవాన్నీ మార్చుకోవాలేమో ఆ పెళ్ళి వాళ్ళ ఇష్టాల కనుగుణంగా అనుకుంది రమ." (రాజకీయ కథలు, పుట 30), ఈ వాక్యం వివాహం కోసం స్త్రీ తన సహజ రూపాన్ని, వ్యక్తిగత ఇష్టాలను సైతం మార్చుకోవాల్సిన పరిస్థితిని ప్రశ్నిస్తుంది. నేటికీ పెళ్లి సంబంధాల్లో అమ్మాయి రంగు, ఎత్తు, శరీరాకృతిని పరిశీలిస్తూ, అబ్బాయిల విషయంలో అదే స్థాయిలో ప్రమాణాలను పాటించకపోవడం సమాజంలోని అసమానతను సూచిస్తుంది. వివాహం ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పర గౌరవంతో ఏర్పడే బంధం కావాలి తప్ప, స్త్రీని అంచనా వేసే పరీక్షగా మారకూడదు.

కథలో రమ తన శరీరంపై తనకే హక్కు ఉందనే భావనతో చివరకు ధైర్యంగా నిర్ణయం తీసుకుంటుంది. "నేను ముక్కు కుట్టించుకోను. ఈ పెళ్ళి ఆగిపోయినా సరే" (రాజకీయ కథలు, పుట 31) అనే వాక్యం ఆమె ఆత్మగౌరవాన్ని, స్వతంత్ర ఆలోచనను బలంగా వ్యక్తం చేస్తుంది. వరుడి, అతని కుటుంబానికి తలవంచే వారి ఇష్టానికి అనుగుణంగా తన రూపాన్ని మార్చుకోవడానికి నిరాకరించడం ద్వారా వివాహం కోసం స్త్రీ తన వ్యక్తిత్వాన్ని త్యాగం చేయాల్సిన అవసరం లేదని రచయిత్రి స్పష్టం చేశారు. కట్నం, అందం, సంప్రదాయాల పేరుతో మహిళలపై ఒత్తిడి చేయడం పితృస్వామ్య ధోరణిలో భాగమే. అయితే ఈ పరిస్థితికి మహిళలను మాత్రమే బాధ్యులుగా చూడకుండా, ఇలాంటి ఆలోచనలను కొనసాగించే కుటుంబ వ్యవస్థను కూడా పరిశీలించాలి. స్త్రీలకు

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛతోపాటు, తమ శరీరం, అభిరుచులు, నిర్ణయాలపై హక్కు కల్పించినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుందని 'ముక్కుపుడక' కథ తెలియజేస్తుంది.

2.4 నోర్ముయ్ -స్త్రీల భావప్రకటన స్వేచ్ఛపై ఆంక్షలు : 'నోర్ముయ్' కథలో స్త్రీలపై సమాజం విధించే ఆంక్షలు, పురుషాధిక్య ధోరణి, భావప్రకటన స్వేచ్ఛను అణచివేయడం ప్రధాన అంశాలుగా కనిపిస్తాయి. జానకి చిన్నతనం నుంచే తన అభిప్రాయాలను చెప్పడానికి ప్రయత్నించినప్పుడు పెద్దలు "నోరు మూసుకుని అవతలకు నడువు, ఎక్కడ లేని సంగతులూ నీకే కావాలి" (రాజకీయ కథలు, పుట 32) అని మందలిస్తారు. అన్నదమ్ములు స్వేచ్ఛగా ఆడుకోవడం, అరవడం సహజంగా భావించిన కుటుంబం, జానకి విషయంలో మాత్రం "ఆడపిల్లకంత నోరు పనికి రాదు" (పుట 32) అని ఆంక్షలు విధిస్తుంది. ఈ ధోరణి ఆడపిల్లలు మౌనంగా ఉండాలని, మగపిల్లలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చని భావించే లింగ వివక్షను తెలియజేస్తుంది. ఎంకటి పాత్ర ద్వారా పేదవారి, అణగారిన కులాల వారి మాటలకు సమాజంలో తగిన విలువ లభించని పరిస్థితిని కూడా రచయిత్రి ఆవిష్కరించారు.

జానకి మౌనానికి కారణం ఆమె సహజ స్వభావం కాదు. చిన్నతనం నుంచి ఎదురైన మందలింపులు, శిక్షలు, భయపెట్టే మాటలు. నవ్వినా, ఏడ్చినా, ప్రశ్నించినా తప్పుపట్టే కుటుంబ వాతావరణం ఆమె భావప్రకటనను అణచివేస్తుంది. "జానకి అతి తక్కువ మాట్లాడడం ప్రయత్నపూర్వకంగా అలవరచుకుంది" (రాజకీయ కథలు, పుట 35) అనే వాక్యం అణచివేత వ్యక్తి వ్యక్తిత్వాన్ని ఎలా మారుస్తుందో తెలియజేస్తుంది. మౌనంగా ఉండటంతో కుటుంబ సభ్యుల ప్రశంసలు పొందినా, క్రమంగా తన ఆలోచనా శక్తిని, ఊహాశక్తిని కోల్పోతుంది. వివాహం తర్వాత భర్త కూడా "నోర్ముయ్ - ఆడదానికంత నోరు పనికి రాదు" (రాజకీయ కథలు, పుట 36) అంటూ ఆమెను అణచివేయడానికి ప్రయత్నిస్తాడు. తనకు అనుకూలంగా ఉన్నప్పుడు భార్య మాటలను ఇష్టపడి, ఆమె ప్రశ్నించడం ప్రారంభించినప్పుడు సహించలేకపోవడం పురుషాధిక్య మనస్తత్వాన్ని బయట పెడుతుంది. "ఇప్పుడు మాటల కోసం యుద్ధం చేయవలసి వస్తోంది" (రాజకీయ కథలు, పుట 36) అనే వాక్యం తన భావాలను వ్యక్తపరచడానికి జానకి పడుతున్న అంతర్గత సంఘర్షణను తెలియజేస్తుంది. భర్త మాటలకు ప్రతిస్పందిస్తూ జానకి పిచ్చిగా నవ్వడం కేవలం హాస్యానికి

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

సంబంధించినది కాదు. తన మాటలను అణచివేసిన సమాజంపై వ్యక్తమయ్యే నిరసనగా, తనలో దీర్ఘకాలంగా పేరుకుపోయిన ఆవేదనకు ప్రతీకగా ఆ నవ్వును అర్థం చేసుకోవచ్చు. ఆమె నవ్వులో బాధ, నిస్సహాయత, అణచివేతపై తిరుగుబాటు కలిసిపోయాయి.

నేటికీ కుటుంబాల్లో మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పలేకపోవడం, ప్రశ్నించే స్త్రీలను పొగరుబోతులుగా ముద్రవేయడం వంటి ధోరణులు కనిపిస్తున్నాయి. అయితే, కుటుంబంలో శాంతి కోసం స్త్రీలే ఎప్పుడూ మౌనంగా ఉండాలని ఆశించడం సమానత్వం కాదు. స్త్రీ మాట్లాడితే తప్పుపట్టడం, మౌనంగా ఉంటే ఆమె భావాలను పట్టించుకోకపోవడం రెండూ అణచివేత రూపాలే. "ఆ మాట చెవుల ద్వారా వచ్చినప్పటికీ తలకాయలో పుట్టింది. రక్తంలో ఇంకింది" (రాజకీయ కథలు,పుట 36) అనే ముగింపు వాక్యాలు నిరంతర అవమానాలు వ్యక్తి మనసులో ఎంత లోతుగా నాటుకుపోతాయో తెలియజేస్తాయి. స్త్రీల మాటలకు గౌరవం ఇవ్వడం, బాల్యం నుంచే ఆడపిల్లలకు ప్రశ్నించే స్వేచ్ఛ కల్పించడం, కుటుంబ నిర్ణయాల్లో సమాన భాగస్వామ్యం కల్పించడం ద్వారా ఈ పరిస్థితులను మార్చవచ్చు. ఈ విధంగా ఓల్గా 'నోర్ముయ్' కథ ద్వారా స్త్రీల గొంతును అణచివేసే సామాజిక వ్యవస్థను విమర్శిస్తూ, భావప్రకటన స్వేచ్ఛ, ఆత్మగౌరవం, సమానత్వం అవసరాన్ని స్పష్టం చేశారు.

2.5 వెన్నెముక - స్త్రీ స్వతంత్ర వ్యక్తిత్వం, నిర్ణయాధికారం : 'వెన్నెముక' కథ స్త్రీల జీవితాల్లో అందం, వివాహం, కులం, స్వేచ్ఛ, వ్యక్తిగత నిర్ణయాల ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. సమాజం స్త్రీని ఎక్కువగా బాహ్య సౌందర్యంతో అంచనా వేస్తుంది. సన్నని నడుము, అందమైన రూపం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ, ఆమె ఆలోచనలు, ఆత్మగౌరవం, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పట్టించుకోదు. ఈ పరిస్థితిని రచయిత్రి రమ దృష్టి ద్వారా చూపించారు. రమ పత్రికల్లో కనిపించే అందమైన స్త్రీల చిత్రాలను చూసి తన నడుము కూడా సన్నగా ఉండాలని కోరుకుంటుంది. అయితే, అందం కంటే స్త్రీకి ఆత్మవిశ్వాసం, ధైర్యం, స్వతంత్రంగా నిలబడే వ్యక్తిత్వం ముఖ్యమని కథ క్రమంగా తెలియజేస్తుంది. రచయిత్రి రాసిన "యివాళ రేపూ ఆడదానికి అవసరమైంది అందమైన సన్నటి నడుంకాదే బలమైన ధృడమైన వెన్నెముక అది నా దగ్గరుంది" (రాజకీయ కథలు, పుట 38) అనే వాక్యం కథలోని ప్రధాన భావాన్ని తెలియజేస్తుంది. ఇక్కడ వెన్నెముక అనేది కేవలం శరీరంలోని

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

భాగం కాదు. అది స్త్రీ ఆత్మగౌరవానికి, ధైర్యానికి, తన జీవితాన్ని తానే నిర్ణయించుకునే శక్తికి ప్రతీకగా నిలుస్తుంది.

రాధిక, విక్టర్ను వివాహం చేసుకోవాలని నిర్ణయించుకోవడం కథలో మరో ముఖ్యమైన అంశం. రాధిక బ్రాహ్మణ కుటుంబానికి చెందినది కాగా, విక్టర్ మాల కులానికి చెందినవాడు. వీరి ప్రేమను స్నేహితులు అర్థం చేసుకున్నప్పటికీ, కులభేదాల వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యల గురించి ఆందోళన చెందుతారు. ఈ సంఘటన సమాజంలో కులవివక్ష ఇంకా బలంగా ఉందని తెలియజేస్తుంది. నేటికీ కులాంతర వివాహాలు చేసుకునే యువత కుటుంబ వ్యతిరేకతను, సామాజిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. వ్యక్తుల మధ్య ప్రేమ, పరస్పర గౌరవం కంటే కులానికి ప్రాధాన్యం ఇవ్వడం సమానత్వ భావనకు విరుద్ధం. వనజ చెప్పే "ఎట్లా వుంటే మనకు సుఖమో మనకే తెలుస్తుంది గదా- కాబట్టి మనం ఎట్లా సుఖపడాలో మనమే నిర్ణయించుకోవాలిగదా" (రాజకీయ కథలు, పుట 41) అనే మాటలు వ్యక్తిగత స్వేచ్ఛకు ప్రాధాన్యాన్ని తెలియజేస్తాయి. ఒక వ్యక్తి జీవితంలో ఏది సంతోషాన్ని ఇస్తుందో నిర్ణయించుకునే హక్కు ఆ వ్యక్తికే ఉండాలి. అయితే, స్వతంత్ర నిర్ణయం అంటే ఇతరుల అభిప్రాయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం కాదు. తన నిర్ణయానికి సంబంధించిన పరిణామాలను అర్థం చేసుకొని, బాధ్యతతో ముందుకు సాగడం కూడా అవసరం. ముఖ్యంగా స్త్రీల జీవితానికి సంబంధించిన నిర్ణయాలను కుటుంబ సభ్యులే తీసుకోవాలనే పద్ధతిలో మార్పు రావాలి.

"ఆ వెన్నెముక బలంగా వుండాలంటే ముందు కావాల్సింది మన గురించి నిర్ణయాలు మనం తీసుకోగలగటం" (రాజకీయ కథలు,పుట 46) అనే వాక్యం కథలోని ఆలోచనకు మరింత స్పష్టతనిస్తుంది. స్త్రీ ఆర్థికంగా స్వతంత్రంగా ఉండటం ఎంత ముఖ్యమో, తన జీవితానికి సంబంధించిన నిర్ణయాలను తానే తీసుకోగలగడం కూడా అంతే ముఖ్యం. చదువు, ఉద్యోగం ఉన్నప్పటికీ వివాహం, కుటుంబ జీవితం, పిల్లలు, ఉద్యోగం వంటి విషయాల్లో స్త్రీ అభిప్రాయానికి విలువ ఇవ్వకపోతే నిజమైన స్వేచ్ఛ సాధ్యపడదు. నేటి సమాజంలో స్త్రీలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నప్పటికీ, వారి వ్యక్తిగత నిర్ణయాలను అంగీకరించడంలో ఇంకా కొన్ని కుటుంబాలు వెనుకబడి ఉన్నాయి. అందువల్ల స్త్రీల అభిప్రాయాలను గౌరవించడం, కుటుంబ నిర్ణయాల్లో వారికి సమాన భాగస్వామ్యం కల్పించడం అవసరం. కథ చివరలో రమ ఆలోచనల్లో వచ్చే మార్పు కూడా ప్రాధాన్యమైనది. మొదట సన్నని

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

నడుము గురించి ఆలోచించిన ఆమె, చివరకు బలమైన వెన్నెముక గురించి ఆలోచిస్తుంది. ఈ మార్పు బాహ్య సౌందర్యానికి ఇచ్చే ప్రాధాన్యం నుంచి ఆత్మగౌరవం, స్వతంత్ర వ్యక్తిత్వం వైపు ఆమె ఆలోచనలు మళ్లడాన్ని సూచిస్తుంది. స్త్రీ విలువను ఆమె రూపంతో కాకుండా, ఆలోచనా శక్తితో, ఆత్మవిశ్వాసంతో, తన జీవితాన్ని తానే నడిపించుకునే సామర్థ్యంతో గుర్తించాలనే భావన ఇందులో కనిపిస్తుంది. ఈ కథలో స్త్రీలు సామాజిక ఆంక్షలుకు భయపడకుండా ఆత్మగౌరవంతో ఉంటూ, స్వతంత్ర నిర్ణయాలు తీసుకుంటూ, వారి హక్కులను కాపాడుకోవాలని రచయిత్రి ఈ కథ ద్వారా చిత్రించారు.

2.6 అయోని -బాలికలపై లైంగిక హింస, మానవత్వం కోల్పోతున్న సమాజం : 'అయోని' కథలో పదేళ్ల బాలికపై జరిగిన లైంగిక హింస ద్వారా బాలల హక్కుల ఉల్లంఘనను, స్త్రీ శరీరాన్ని వస్తువుగా చూసే పురుషాధిపత్య ధోరణిని రచయిత్రి ప్రశ్నించారు. కథానాయికను అపహరించి లైంగిక వ్యాపారంలోకి నెట్టడం వల్ల ఆమె బాల్యం, స్వేచ్ఛ, మానసిక ప్రశాంతత పూర్తిగా దెబ్బతింటాయి. ఒకప్పుడు అమ్మమ్మ చెప్పిన కథలను వింటూ, అందమైన కలలు కంటూ పెరిగిన బాలిక జీవితం ఒక్కసారిగా భయంకరమైన అనుభవాలతో నిండిపోతుంది. ఈ మార్పు బాలికల జీవితాలను హింస ఎలా చిన్నాభిన్నం చేస్తుందో తెలియజేస్తుంది. "అప్పుడు నేను చిన్నపిల్లను కాదు, మనిషిని కాదు, ప్రాణినికూడా కాదేమో, ఒక యోనిని. అంతే. అదొక్కటే" (రాజకీయ కథలు, పుట 62) అనే వాక్యాలు కథలో అత్యంత ముఖ్యమైనవి. బాధిత బాలికను వ్యక్తిత్వం, భావాలు, ఆశలు కలిగిన మనిషిగా కాకుండా, తన శరీరంలోని ఒక భాగంగా మాత్రమే చూసిన అమానవీయ పరిస్థితిని ఈ మాటలు తెలియజేస్తాయి. తనను మనిషిగా చిన్నపిల్లగా చూడాలని ఆమె కోరుకున్నా ఆ మాట వినేవారు లేకపోవడం సమాజంలో దిగజారుతున్న మానవత్వాన్ని స్పష్టం చేస్తుంది. ఇక్కడ రచయిత్రి కేవలం ఒక బాలిక బాధను మాత్రమే కాకుండా, స్త్రీ శరీరంపై అధికారం తమకే ఉందని భావించే పురుషాధిపత్య ఆలోచనను కూడా ప్రశ్నించారు.

కథానాయిక తన గతాన్ని గుర్తుచేసుకుంటూ చెప్పే మాటలు బాల్యం ఎంత సున్నితమైనదో తెలియజేస్తాయి. ఒకప్పుడు ఆకలి అంటే రుచిగా అన్నం తినాలనే ఆనందం, చీకటి అంటే చందమామను చూడాలనే సంబరం ఆమెకు ఉండేవి. కానీ హింసకు గురైన తర్వాత ఆకలి, చీకటి, భయం అన్నీ ఆమెకు బాధాకరమైన అనుభవాలుగా మారాయి. దీనివల్ల శారీరక హింస మాత్రమే

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

కాకుండా, బాలిక మనసులో ఏర్పడే భయం, అభద్రత, ఒంటరితనం కూడా ఎంత తీవ్రమైనవో అర్థమవుతుంది. "ఈ బాధ మనలాంటి వాళ్ళకేగా చాలామంది హాయిగా ఉన్నారుగా, తల్లిదండ్రుల దగ్గర హాయిగా పెరిగి పెద్దయ్యే పిల్లలకు ఈ బాధ ఉండదుగా" (రాజకీయ కథలు, పుట 63) అనే మాటలు సురక్షితమైన బాల్యం అందరికీ లభించడం లేదనే వాస్తవాన్ని తెలియజేస్తాయి. కొందరు పిల్లలు తల్లిదండ్రుల ప్రేమలో, భద్రతలో పెరుగుతుంటే, మరికొందరు అపహరణ, లైంగిక దోపిడీ, అక్రమ రవాణా వంటి దారుణాలకు బలవుతున్నారు. ఈ వ్యత్యాసం సమాజంలోని బాధ్యతారాహిత్యాన్ని బయటపెడుతుంది.

నేటి సమాజంలో బాలికల రక్షణ, విద్య, హక్కుల గురించి విస్తృతంగా చర్చ జరుగుతున్నప్పటికీ, లైంగిక వేధింపులు, అత్యాచారాలు, బాలల అక్రమ రవాణా పూర్తిగా అరికట్టబడలేదు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు బాధితుల ప్రవర్తనను ప్రశ్నించడం, వారి వస్త్రధారణను తప్పుబట్టడం, వారి బాధను తక్కువగా చూడడం వంటి ధోరణులు సమస్యను మరింత పెంచుతాయి. నేరానికి బాధితులు బాధ్యులు కాదనే అవగాహన సమాజంలోని ప్రతి ఒక్కరిలో ఉండాలి.

కథ చివరలో కథానాయిక తనకు జరిగిన అన్యాయాన్ని భరించలేక చనిపోవాలని కోరుకోవడం, ఆమె అనుభవించిన తీవ్రమైన మానసిక వేదనకు నిదర్శనం. అయితే, ఆమె మరణాన్ని సమస్యకు పరిష్కారంగా చూడకుండా, బాధితులకు జీవించే ఆశను, న్యాయం పొందే అవకాశాన్ని కల్పించాల్సిన బాధ్యత సమాజం, ప్రభుత్వాలపై ఉందని గుర్తించాలి. సృష్టికి మూలమైన స్త్రీనే సమాజంలో లైంగిక హింసకు, పురుషాధిపత్య ధోరణులకు బలికావడం సామాజిక వ్యవస్థలోని వైరుధ్యాన్ని వెల్లడిస్తుంది. ఈ హింసను భరించలేని స్థితిలో మాతృత్వాన్ని సైతం వదులుకొని, అయోనిగా మారితే బాగుంటుందనే ఆలోచనకు కథానాయిక చేరుకోవడం ఆమె అంతరంగ సంఘర్షణకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ పాత్ర ద్వారా స్త్రీ తన అస్తిత్వాన్ని, స్వేచ్ఛను కాపాడుకోవడంలో ఎదుర్కొంటున్న సంక్లిష్ట పరిస్థితులను రచయిత్రి ఆవిష్కరించారు. స్త్రీని సృష్టికి మూలంగా గౌరవిస్తూనే, ఆమెకు భద్రతను, గౌరవాన్ని కల్పించడంలో విఫలమవుతున్న వైరుధ్యాన్ని ఈ కథ ఎత్తిచూపుతుంది.

ISSN:3048-5908 Impact Factor: 6.673 (SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-3, Issue-4, (Oct/Nov&Dec-2026)

3. ముగింపు : ఓల్గా రచించిన రాజకీయ కథలు స్త్రీ అస్తిత్వాన్ని, స్త్రీవాద దృక్పథాన్ని సామాజిక నేపథ్యంతో ఆవిష్కరించిన కథలుగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. స్త్రీల జీవితాల్లో సాధారణంగా కనిపించే అనుభవాల వెనుక దాగి ఉన్న పితృస్వామ్య భావజాలాన్ని రచయిత్రి స్పష్టంగా చిత్రించారు. స్త్రీ శరీరం, మనసు, వ్యక్తిత్వంపై సమాజం విధించే ఆంక్షలను ప్రశ్నిస్తూ, వారి స్వేచ్ఛ, ఆత్మగౌరవం, స్వయంనిర్ణయాధికారాల ప్రాధాన్యాన్ని నొక్కిచెప్పారు. వ్యక్తిగత జీవితానికి సంబంధించిన సమస్యలు కూడా సామాజిక, రాజకీయ వ్యవస్థలతో విడదీయలేని సంబంధాన్ని కలిగి ఉంటాయని ఈ కథలు తెలియజేస్తాయి. సంప్రదాయం పేరుతో స్త్రీలను అణచివేసే ధోరణులను విమర్శిస్తూ, స్త్రీ పురుషుల మధ్య సమానత్వం, పరస్పర గౌరవం ఆధారంగా మానవ సంబంధాలు ఏర్పడాల్సిన అవసరాన్ని ఓల్గా బలంగా ఆవిష్కరించారు. ఈ విధంగా ఆమె రాజకీయ కథలు స్త్రీల అస్తిత్వ సమస్యలను మాత్రమే కాకుండా, సమాజంలోని అసమానతలను ప్రశ్నించే చైతన్యాన్ని కూడా కలిగిస్తూ తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. ఓల్గా, రాజకీయ కథలు, 2018, నవోదయ బుక్ హౌస, హైదరాబాద్.

2. ఓల్గా (సం.పా), నీలి మేఘాలు (స్త్రీవాద కవిత్వ సంకలనం), 1993, అస్మిత ప్రచురణలు, హైదరాబాద్.

3. కాత్యాయనీ, విద్మహే, (సం.పా), స్త్రీవాద వివాదాలు, 2001, అస్మితా ప్రచురణలు, హైదరాబాద్.

4. ఛాయాదేవి, అబ్బూరి, తనమార్గం (కథాసంపుటి), 2002, విశాలాంధ్ర, హైదరాబాద్.

5. డా.ద్వానా శాస్త్రి, తెలుగు సాహిత్య చరిత్ర, 2008, ప్రగతి పబ్లికేషన్స్, హైదరాబాద్.

6. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి, కథా శిల్పం, 1995, విశాలాంధ్ర పబ్లికేషన్ హౌస్, హైదరాబాద్.